సాక్షి
చిత్తూరు
శనివారం ၊ 30 ၊ సెప్టెంబర్ ၊ 2023



‘ఆరోగ్య(ం)..సురక్షి’(తం)

రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా భావించి ఆ దిశగా అడుగులు వేస్తోంది. - 8లో



డ్రైవర్లు క్షేమంగా ఉండేలా....

డ్రైవర్లు క్షేమంగా ఉండేలా ప్రభుత్వం వాహన మిత్ర పథకాన్ని అమలు చేస్తోందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	24
తిరుపతి	33	24
తిరుమల	29	21
గూడూరు	36	27
నగరి	35	25

న్యూస్‌రీల్

వ్యాధిగ్రస్తులు సంతృప్తిపడేలా వైద్యం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : వ్యాధిగ్రస్తులు సంతృప్తిపడేలా వైద్యం అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని జిల్లా ప్రత్యేకాధికారి వీరపాండ్యన్, కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి సీఎం ప్రసంగాన్ని వర్చువల్‌గా ప్రజాప్రతినిధులు, అధికారులు వీక్షించారు. అనంతరం వీరపాండ్యన్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు క్యాంపులు నిర్వహించి వైద్యసేవలందించాలని చెప్పారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో 478 క్యాంపులకు ఏర్పాట్లు చేశామన్నారు. క్యాంపుల్లో ప్రత్యేక వైద్యులు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షల్లో ఎక్కువ భాగం ఏ వ్యాధులు వచ్చాయో పరిశీలించాలన్నారు. 14 రకాల వ్యాధులకు ప్రత్యేక వైద్యులు జిల్లాకు రానున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, డీఎంఅండ్‌హెచ్ ఓ ప్రభావతి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

5న క్రీడా అకాడమీలో ప్రవేశానికి ఎంపికలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాస్థాయిలో అక్టోబర్ 5వ తేదీన రాష్ట్ర క్రీడా అకాడమీలో ప్రవేశానికి జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ బాలాజీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని క్రీడాప్రాంగణంలో బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లో బాలురకు ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 12 -18 ఏళ్లలోపు బాలురు పోటీలకు అర్హులన్నారు. అర్హత ఉన్నవారు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, 3 కలర్ ఫొటోలు, క్రీడలకు సంబంధించిన పార్టిసిపేషన్, ప్రశంసాపత్రాలు తీసుకుని 5వ తేదీ ఎంపికలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9849014639లో సంప్రదించాలని కోరారు.



విరిగిన కాలును సరిచేస్తున్న డాక్టర్ ఎస్.కృష్ణమరాజు

శల్య వైద్యంలో.. రారాజు

- మాది తమిళనాడు రాష్ట్రం, తిరువళ్లూరు పట్టణం. నా పేరు వీ.బాబు. బాత్‌రూమ్‌లో జారిపడ్డాను. నా ఎడమ చేయి విరిగింది. పుత్తూరు కట్టు గురించి నాకు అవగాహన ఉంది. అందుకే నేరుగా ఇక్కడికే వచ్చి కట్టు కట్టించుకున్నాను. మూడుకట్లు పూర్తయ్యాయి. నొప్పి లేదు. చేయి మామూలు స్థితికి వచ్చింది. ఇక్కడి దాక్టర్ల నైపుణ్యం వెలకట్టలేనిది.

- నా పేరు కే.కన్నభిరామ్. మా ఊరు కాంచీపురం, తమిళనాడు రాష్ట్రం. మోటర్ సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాను. నా కుడి కాలు తొడ ఎముక విరిగిపోయింది. మూడో కట్టు కట్టుకోవడానికి వచ్చాను. ఈ కట్టుతో నడవగలుగుతానని డాక్టర్లు చెబుతున్నారు. ప్రస్తుతానికి నొప్పి పూర్తిగా తగ్గింది. ఇక్కడ ఫీజు మేము ఇచ్చినంతే తీసుకుంటున్నారు.

మానవుని శరీరం మొత్తం ఎముకల గూడు. ఏ అవయవానికి దెబ్బతగిలినా ఆ వ్యక్తి విలవిల్లాడాల్సిందే. అలాంటిది ఏకంగా ఎముకే విరిగిపోవడం, కీళ్లు తొలగిపోవడం లాంటివి జరిగితే ఆ వ్యక్తి బాధ వర్ణణాతీతం. ఇలా విరిగిన, తొలగిన ఎముకలను ఎలా అతికించాలి, ఎలా సరిచేయాలి, నడవలేని వ్యక్తిని ఎలా నడిపించాలి..? అన్న ప్రశ్నలకు సమాధానం ‘పుత్తూరు శల్యంవైద్యం’. నేడు ఆధునిక వైద్య విధానాలు వచ్చినా.. పుత్తూరు కట్టు ముందు అన్నీ తీసికట్టు. ఇది రాజులకు లభించిన వరప్రసాదం. పేద రోగులకు ఆరోగ్యప్రదాయం. వందేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతున్న పుత్తూరు శల్యవైద్యంపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం..!

- పుత్తూరు శల్యవైద్యం..రాజులకు లభించిన వరప్రసాదం
- విరిగిన ఎముకలకు మునివేళ్లతోనే వైద్యం
- మూడు కట్లు, మూడు వారాల్లో గాయం మటుమాయం
- 1922 నుంచి కొనసాగుతున్న వైనం
- రాష్ట్రపతులు, ముఖ్యమంత్రులు సైతం పుత్తూరు వైద్యానికి ఫిదా!

సాక్షి, తిరుపతి: పుత్తూరు శల్యవైద్యం దైవానుగ్రహంగా ‘రాజు’లకు లభించిన వరప్రసాదం. ఇదే విషయాన్ని సూరపరాజు సుబ్బరాజు వంశస్థులు ఈ వైద్యం పుట్టుక గురించి చెబుతుంటారు. పుత్తూరు మండలం, రాచపాళెంలో 1922లో ఈ వైద్యం పురుడుపోసుకుంది. సూరపరాజు సుబ్బరాజు ఓ రోజు అడవిలో వేటకు వెళ్లి వేటాడిన మాంసపు ముక్కలను చెట్ల ఆకుల్లో చుట్టుకొని ఇంటికి తీసుకొచ్చారు. ఆకుల్లోని ఎముకలు ఒకదానికొకటి అతుక్కొని ఉండడాన్ని గమనించి ఆశ్చర్యపోయారు. అదే ఆకులతో ఎముకలు విరిగిన జంతువులకు కట్టుకట్టడం.. ఆ తర్వాత మనుషులకు కట్టుకట్టడం ప్రారంభించారు. అప్పటి నుంచి నేటి వరకు పుత్తూరు శల్య వైద్యం అప్రహితంగా కొనసాగుతోంది. రాచపాళెం గ్రామం నుంచే నేటికీ ఇదే వైద్య వృత్తిని కొనసాగిస్తున్నారు.

శల్య వైద్య విధానం

ఎక్స్‌రే తీయరు. మత్తు మందు ఇవ్వరు. చేతి మునివేళ్లతోనే ఎముక విరిగిందా లేదా గుర్తిస్తారు. తర్వాత తమ రెండు చేతులతో విరిగిన ఎముకలను సరిచేసి కట్టుకడుతారు. ముందుగా తయారుచేసి పెట్టుకున్న ఆకు పసరుకు కాసింత గుడ్డ, రెండు కోడి గుడ్లు



విరిగిన కాలికి కట్టుకడుతున్న డాక్టర్ ప్రకాష్‌రాజు

తెల్లసొన, రెండు వెదురు దబ్బలే ఈ వైద్యానికి పరికరాలు. ఎముక విరిగిన, తొలగిన భాగాన దూదిని ఉంచి ఆకు పసరు రాసి గుడ్డ చుడుతారు. ఎముక భాగం కదలకుండా వెదురు దబ్బలను పెట్టి కట్టుకడతారు. ఏడు రోజులకు ఒకసారి వంతున మూడు కట్లు కడతారు. అంతే గాయం నయమవుతుంది.

పేదలకు పూర్తి ఉచితం



మా పూర్వీకుల నుంచి సంక్రమించిన వైద్యమిది. మాది నాల్గోతరం. మా వైద్యంలో సక్సస్ రేటు 99.9 శాతంగా ఉంది. వందేళ్ల చరిత్రే ఇందుకు నిదర్శనం. పేదలతోపాటు పుత్తూరు వాసులకు పూర్తి ఉచిత వైద్య సేవలందిస్తున్నాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నాం. ఆస్పత్రి ఆవరణలోనే 25 గదులను రోగులకు అందుబాటులో ఉంచాం. ఆస్పత్రి సమీపంలోనే టీటీడీ వారిచే మరో 25 గదులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. – డాక్టర్ ఎస్.కృష్ణమరాజు, మేనేజింగ్ డైరెక్టర్, పుత్తూరు శల్యవైద్యశాల

ఇచ్చినంతే ఫీజు

రాచపాళెంలోని ప్రధాన ఆస్పత్రిలో పది రూపాయల రశీదు తీసుకొని లోపలికి వెళితే పది నిమిషాల్లో కట్టు కట్టేస్తారు. తర్వాత రోగి తనకు తోచింది ఇస్తే డాక్టర్ ఫీజుగా తీసుకుంటారు.

పూర్వీకుల వివరాలు

పుత్తూరు శల్యవైద్య వ్యవస్థాపకులు సూరపరాజు సుబ్బరాజు. ఈయనకు నలుగురు తమ్ముళ్లు. వీరిలో ఎస్.మార్కొండేయరాజు, ఎస్.గంగరాజు ఇదే వృత్తిని కొనసాగించారు. ఇంకో ఇద్దరు తమ్ముళ్లు ఎస్.చెంగల్‌రాజు, ఎస్.వెంగమరాజు వైద్య వృత్తికి దూరంగా ఉన్నా, వారి కుమారులైన ఎస్.ప్రకాష్‌రాజు, కన్నయ్యరాజు ఇదే వృత్తిలో కొనసాగారు. గంగరాజు కుమారుడైన ఎస్.కృష్ణమరాజు, మార్కొండేయరాజు కుమారులైన రామరాజు, సుబ్రమణ్యంరాజు ఇదే వృత్తిలో కొనసాగారు. పాత తరంలోని ఎస్.కృష్ణమరాజు, ఎస్.ప్రకాష్‌రాజుతో పాటు సుబ్రమణ్యంరాజు కుమారుడు ఎస్.ప్రతాప్‌రాజు, కన్నయ్యరాజు కుమారుడు ఎస్.బాలసుబ్రమణ్యంరాజు ప్రస్తుతం వైద్య సేవలు అందిస్తున్నారు.



సీఎం ఎన్టీ రామారావుకు కట్టుకడుతున్న డాక్టర్ మార్కొండేయరాజు (ఫైల్)

ప్రముఖులు ఫిదా!

పుత్తూరు శల్యవైద్యం పొంది ఉపసమనం పొందిన వారిలో మాజీ రాష్ట్రపతులు వీవీ.గిరి, నీలం సంజీవరెడ్డి, మాజీ ముఖ్యమంత్రులు టీ.అంజయ్య, నందమూరి తారక రామారావు. కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు ఉన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి ఇక్కడికి వచ్చి వైద్యం పొందిన వారు ఉన్నారు. ఇలా వచ్చిన వారు విజిటర్స్ బుక్‌లో తమ వివరాలను పొందుపరచడం విశేషం.



రాష్ట్రపతి వి.వి.గిరికి కట్టుకడుతున్న డాక్టర్ మార్కొండేయరాజు (ఫైల్)

ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు

- మండల పర్యటనలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సోమల: ప్రజల ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం సోమల మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లె నుంచి ప్రారంభమైన మంత్రి పర్యటన వల్లగట్ల పంచాయతీ గల్లావారిపల్లెలో ముగిసింది. పర్యటనలో భాగంగా రూ.2.84 కోట్లతో నిర్మించిన 9 ఆర్వో ప్లాంట్లు, 5 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, 2 రైతు భరోసా కేంద్రాలు, 3 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయ భవనం, 2 ఓవర్ హెడ్ ట్యాంకులు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ భవనాన్ని ప్రారంభించారు. అలాగే పెద్ద ఉప్పరపల్లె, సోమల, కందుకూరు పంచాయతీల్లో రూ.1.35 కోట్లతో 3 షాదీమహళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొత్తం 12 పంచాయతీల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ప్రజలు మహిళలు, యువకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం పాదలగుంటపల్లెలో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మండల కన్వీనర్ గంగాధరం, పార్టీ మైనారిటీ విభాగం మండల అధ్యక్షుడు మస్తాన్ వలీ, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, సర్పంచులు విమల, భారతి, జయరాం, వెంకటరమణ, రెడ్డెప్ప, చంద్రకళ, మసూద్, సురేంద్రరెడ్డి, శ్రీదేవి, సౌజన్య, ఎంపీటీసీ సభ్యులు సర్వేశ్వరి, నాగభూషణంరెడ్డి, సావిత్రమ్మ, వేముల హరినాథ, కళ్యాణి పాల్గొన్నారు.

ఆరోగ్యం..సురక్షితం

రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా భావించి ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష అమలు చేసింది. ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటి తలుపు తట్టి..రోగులను గుర్తిస్తోంది. పల్లె ముంగిటే వైద్యశిబిరం ఏర్పాటు చేసి.. నిపుణులతో ఆ సమీప పీహెచ్‌సీలోనే అన్ని వైద్యసేవలు అందించనుంది. ఫలితంగా పేదలకు ఆరోగ్యానందం కలగనుంది.

- వేగంగా సాగుతున్న ఆరోగ్య సురక్ష సర్వే
- ఇంటింటా వలంటీర్లు, వైద్యబృందం
- క్షేత్రస్థాయిలో ఏడు రకాల పరీక్షలు
- నేటి నుంచి జిల్లాలో మెగా హెల్త్ క్యాంపులు


చిత్తూరు నగరంలో ఇంటింటా సర్వేలో వైద్యబృందం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి

చిత్తూరు రూరల్: మాయరోగాలను ఆదిలోనే మట్టుబెట్టి.. నిరుపేదలకు ఆరోగ్యభాగ్యం చేకూర్చాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇంటింటా సర్వేను చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13.13 లక్షల కుటుంబాలు ఉండగా..సుమారు 32.50 లక్షల మంది జనాభా ఉన్నారు. ఈ కుటుంబాల్లో అందరికీ పరీక్షలు చేయనున్నారు.

చురుగ్గా ఇంటింటి సర్వే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే చురుగ్గా సాగుతోంది. తొలి దశలో ఇంటింటి సర్వేని 21,417 మంది వలంటీర్లు ప్రారంభించగా..రెండో దశగా 1,333 మంది ఏఎన్‌ఎంలు, 902 మంది మిడిలెవల్ హెల్త్ ప్రొవైడర్లు సర్వే ప్రక్రియ చేపట్టారు. వీరంతా అనారోగ్య లక్షణాలున్న వారికి వారి ఇంటి వద్దే ఏడు రకాల పరీక్షలు చేస్తున్నారు. పరీక్షల ఆధారంగా మెగా వైద్య శిబిరానికి రావాలని టోకన్లు ఇస్తున్నారు.

పరీక్ష వివరాలిలా..

ఇప్పటివరకు వలంటీర్లు 5,91,662 కుటుంబాలు, వైద్య బృందం 487621 కుటుంబాల తలుపుతట్టారు. ఈ కుటుంబాల్లోని 14,87,420 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 7,66,595 మందికి బీపీ, 6,64,997 మందికి మధుమేహం, 7,15,023 మందికి హెచ్‌బీ, 9,189 మంది యూరియన్, 3,518 మందికి మలేరియా, 7,463 మందికి డెంగీ, 7,333 స్పుటమ్ పరీక్షలు చేశారు. కాగా ఇప్పటివరకు 25 వేల మందికి టోకన్లు అందజేశారు. వీరందరినీ మెగా హెల్త్ క్యాంపునకు రావాలని సూచిస్తున్నారు.

నేటి నుంచి మెగా హెల్త్ క్యాంపు

జిల్లాలో ఈనెల 30వ తేదీ నుంచి మెగా వైద్యశిబిరాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ముందస్తుగానే రాష్ట్ర ప్రభుత్వం ట్రయల్ రన్ చేపట్టింది. పైలెట్ ప్రాజెక్టు కింద చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలం తుంబకుప్పం పీహెచ్‌సీ పరిధిలోని తిమోజీపల్లె ప్రాథమిక పాఠశాలలో, తిరుపతి రూరల్‌లోని దామినేడు పీహెచ్‌సీ, మల్లవరం పీహెచ్‌సీలో హెల్త్ క్యాంపు నిర్వహించి ట్రయల్ చూశారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న మెగా హెల్త్ క్యాంపునకు సంసిద్ధమయ్యారు. శనివారం తిరుపతి జిల్లాలో 17 ప్రాంతాలు, చిత్తూరు జిల్లాలో 32 ప్రాంతాల్లో మెగా హెల్త్ క్యాంపుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పక్కాగా హెల్త్ క్యాంపులు



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వేగవంతంగా చేస్తున్నాం. అధికారుల పర్యవేక్షణతో సర్వే పూర్తయ్యేలా చూస్తున్నాం. ట్రయల్‌రన్ కూడా పూర్తి అయ్యింది. శనివారం నుంచి మెగా హెల్త్ క్యాంపులు పకడ్బందీగా నిర్వహిస్తాం. వైద్యులు, సిబ్బంది కేటాయింపు కూడా పూర్తి చేశాం. పక్కాగా జరిగేలా ఏర్పాట్లు చేశాం.

–డాక్టర్ ప్రభావతిదేవి,
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, చిత్తూరు

గణేశ దీక్ష ఇరుముడుల చెల్లింపు


కాణిపాకంలో ఇరుముడులు చెల్లిస్తున్న తూర్పుగోదావరి నిడదవోలుకు చెందిన గణేష దీక్ష భక్తులు

కాణిపాకం(యాదమరి): గణేష దీక్ష చేపట్టిన 40 మంది భక్తులు శుక్రవారం కాణిపాకంలో ఇరుముడులు చెల్లించారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన సత్యనారాయణమూర్తి బృందం మండల దీక్షను తీసుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండల వ్రతం పూర్తి కావడంతో వారు ఇరుముడులు ధరించి, ఉదయం కాణిపాకం చేరుకున్నారు. వారికి ఆలయాధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వారు ఆలయ సమీపంలో గణేష దీక్ష భక్తులకు ఏర్పాటు చేసిన మండపంలో ఇరుముడులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నివారణకు కృషి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ చౌర్యం నివారణకు కృషి చేస్తున్నట్లు డీపీఈ(విద్యుత్ చౌర్య నిరోధక విభాగం) డిస్కం ఎస్ఈ శ్రీనివాస్‌బాబు తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం నగరంలోని కొంగారెడ్డిపల్లెలోని వాణిజ్య, పరిశ్రమ సర్వీసులను పరిశీలించారు. ఆ రెండు సర్వీసులు లోడ్ అధికంగా వాడుతున్నట్లు గుర్తించి, క్రమబద్ధీకరణ చేసుకోవాలని నోటీసులు అందజేశారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

పలమనేరు: ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం పలమనేరు మండలం ముడివారిపల్లెలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పలమనేరు మండలంలోని ముడివారిపల్లెకు చెందిన గుణవెంకటరమణ(27) పెద్దపంజాణి మండలంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. అతడు శుక్రవారం తన సొంత ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు అతన్ని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తెలిసిందని సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

ముగ్గురి అరెస్టు

చిత్తూరుఅర్బన్: నగరంలోని కొంగారెడ్డిపల్లెలో సుమతి కుమారుడు యశ్వంత్ (5) అనే బాలుడి మృతికి కారణమైన కేసులో కుప్పమ్మ, కుమారి, మురళి అనే ముగ్గురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. సత్యనారాయణపురంలో సుమతి, ఆమె కుమారుడు యశ్వంత్‌తో కలిసి మిద్దె పైనుంచి దూకిన విషయం తెలిసిందే. వేధింపులు తాళలేకే బిడ్డతో కలిసి ఆత్మహత్యకు పాల్పడినట్టు సుమతి పోలీసులకు వాంగ్మూలం ఇచ్చింది. సుమతి అత్త కుప్పమ్మ, ఆడపడుచు కుమారి, కుమారి భర్త మురళిని అరెస్టు చేసి, న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

'జగనన్నకు చెబుదాం'కు విశేష స్పందన


అర్జీ పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

విజయపురం (నగరి) : మండల స్థాయిలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం మండల కార్యాలయ ఆవరణలో జేసీ శ్రీనివాసులు అధ్యక్షతన జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 నుంచి 2 గంటలకు వరకు సాగిన ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జిల్లా, మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులతో కలసి జేసీ ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించి, ఆయా శాఖల అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. మరి కొన్నింటిని త్వరగా పరిష్కారించాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే అందజేయాలని ఈఓపీఆర్‌డీకి సూచించారు. మొత్తం 186 అర్జీలు రాగా అందులో 100కు పై గాఅర్జీలు పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు.

జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై హర్షం

గతంలో ఏదైన సమస్య వస్తే జిల్లా కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. కానీ ప్రజల సమస్యలను వారి క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని శాఖ అధికారులు ఒకే వేదికపై ఉండడం, అర్జీ వచ్చిన వెంటనే వాటికి పరిష్కార మార్గం చూపడంతో ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి, ఆర్డీఓ సుజన, డీఎల్‌డీఓ రవీంద్రకుమార్, ఎంపీపీ జమున, వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ వెంకట్రాయులు, ఈఓపీఆర్‌డీ బాబు, పంచాయతీ కార్యదర్శి నరేంద్రకుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు క్షేమంగా ఉండేలా..


వైఎస్సార్ వాహనమిత్ర మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- ఘనంగా జిల్లా స్థాయి ఐదో విడత వైఎస్సార్ వాహనమిత్ర పథకం
- జిల్లా లో 6,482 మందికి రూ.6.48 కోట్లు జమ
- వర్చువల్ విధానంలో సీఎం ప్రసంగం వీక్షించిన లబ్ధిదారులు
- పాల్గొన్న జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : సొంత వాహనం కలిగిన ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు క్షేమంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ వాహనమిత్ర పథకాన్ని అమలు చేస్తోందని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఐదో విడత వైఎస్సార్ వాహనమిత్ర పథకం జిల్లాస్థాయి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, అధికారులు వర్చువల్ విధానంలో వీక్షించారు. జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను పారదర్శకతతో అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్సార్ వాహనమిత్ర పథకాన్ని తమ సర్కారు అమలు చేసిందన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఐదేళ్లపాటు వాహనమిత్ర పథకం అమలు చేసిందన్నారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ వాహనమిత్ర పథకం లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టామన్నారు. ఐదో విడతలో జిల్లాలోని 6,482 మంది లబ్ధిదారులకు రూ.6,48,20,000ను ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఐదో విడత వైఎస్సార్ వాహనమిత్ర పథకం మెగా చెక్కును అందజేశారు. మేయర్ అముద, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, స్త్రీశిశుసంక్షేమ శాఖ చైర్మన్ శైలజారెడ్డి, డీటీసీ నిరంజన్‌రెడ్డి, జెడ్పీ మహిళా స్థాయి సంఘ చైర్‌పర్సన్ భారతి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సీఎం మేలు మరువలేం



నేను 1999 నుంచి ఆటో నడుపుతున్నాను. ఆటో సోదరులకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని అమలు చేశారు. కరోనా కష్టకాలంలో కూడా పథకాన్ని అమలు చేసి ఆదుకున్నారు. ప్రభుత్వం ఏటా అందిస్తున్న రూ.10 వేలు ఎంతో ఉపయోగపడుతోంది. సీఎం జగనన్న రుణం ఎప్పటికీ మరిచిపోం.

- నౌషాద్, ఆటో డ్రైవర్, దర్గాసర్కిల్, చిత్తూరు

రావణబ్రహ్మపై వినాయకుడు


రావణబ్రహ్మ వాహనంపై వినాయకస్వామి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వ రసిద్ధి వినాయక ప్రత్యేక ఉత్సవాల్లో శుక్రవారం సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వా మి రావణబ్రహ్మ వాహనంపై పుర వీ ధుల్లో విహరించారు. వేకువ జామున స్వయంభు వరసిద్ధి వినాయక స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఉభయకర్తలు మేళ తాళాలతో స్వామివారి వాహన సేవకు వరస(పూజాసామగ్రి) తీసుకొచ్చారు. అర్చకులు స్వామివారి అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలకు సుగంధ భరిత పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అలంకార మండపం నుంచి ఉత్సవ విగ్రహాలను మోసుకుంటు తీసుకొచ్చి రావణబ్రహ్మ వాహనంపై కొలువు తీర్చారు. అర్చకుల ప్రత్యేక పూజల అనంతరం మేళ తాళాలు, కళాకారుల కొలాటలు, చెక్కభజనల నడుమ స్వామివారిని పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు మంగళ హారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ వాహన సేవకు పుణ్యసముద్రం, లక్ష్మాంబపురం, సంతపల్లె, ద్వారకాపురం, కురప్పల్లె, సిద్ధంపల్లె, ముద్దురామాపురం గ్రామాల వాసులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేడు యాళివాహన సేవ : ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా శనివారం వరసిద్ధి వినాయక స్వామివారికి యాళివాహన సేవ నిర్వహించనున్నారు. ఉదయం మూలస్థానంలోని వినాయకునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. రాత్రి వాహన సేవ నిర్వహిస్తారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): అనుమానాస్పదంగా మృతి చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని ఠాణా వెంకటాపురం గ్రామానికి చేరుకున్న డిప్యూటీ సీఎం, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతితో కలసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ విద్యార్థి దశలో యువతి అనుమానాస్పందంగా మృతి చెందిన విషయం బాధాకరమన్నారు. హత్య అని తేలితే ఈ కిరాతకానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. ఆ కుటుంబానికి అన్ని విధాల అండగా నిలవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అనంతరం వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ రేవతి మాట్లాడుతూ విద్యార్థిని మృతి కేసుపై జిల్లా ఎస్పీతో మాట్లాడామని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారన్నారు. నాలుగైదు రోజుల్లో ల్యాబ్ రిపోర్టు వచ్చే అవకాశం ఉందని, రిపోర్ట్సు అనంతరం దర్యాప్తు వేగవంతం చేస్తామని పోలీస్ అధికారులు చెప్పారన్నారు. అలాగే బీసీ చైతన్య రాష్ట్ర అధ్యక్షుడు బీసీ రమణ కూడా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వెంకటేష్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్, వడ్డెర నాయకులు మురగయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి


జయశంకర్ (ఫైల్)

రామకుప్పం: ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం రామకుప్పం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వీర్నమల పంచాయతీ కుళ్లగానూరుకు చెందిన చిన్నతంబి కుమారుడు జయశంకర్(22) అడ్డగట్టుతండాకు చెందిన చంద్రశేఖర్‌నాయక్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కుళ్లగానూరుకు చెందిన రైతు సెల్వం పొలంలో దిబ్బ ఎరువు దించడానికి జయశంకర్ ట్రాక్టర్ తీసుకుని వెళ్లాడు. పని ముగించుకుని పొలం నుంచి డ్రైవర్ జయశంకర్‌తోపాటు రైతు సెల్వం తిరిగి బయలుదేరారు. మార్గం మధ్యలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ జయశంకర్ ట్రాక్టర్ కింద చిక్కుకుని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అపస్మారకస్థితిలో పడిపోయిన సెల్వంను గమనించిన స్థానికులు వీర్నమల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఎన్నికల విధులకు సిద్ధంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: త్వరలో ఎన్నికలు రానుండడంతో విధులు నిర్వర్తించడానికి పోలీసులు మానసికంగా, శారీరకంగా సిద్ధంగా ఉండాలని చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. చిత్తూరులోని పోలీసు శిక్షణ కేంద్రంలో శుక్రవారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల విధులకు అందరూ సమాయత్తం కావాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి ఇప్పటి నుంచే శాంతిభద్రతలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి చోట పోలీసులు ప్రజలకు కనిపించాలని, అసాంఘిక శక్తుల్ని ఉపేక్షించొద్దన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. సైబర్ క్రైమ్ మోసాలు ఇటీవల ఎక్కువయ్యాయని, ప్రజల్లో దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. బాధితులు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే తప్పకుండా కేసు నమోదు చేయాలన్నారు. కాగా పుంగనూరులో గతనెల జరిగిన అల్లర్లలో నిందితులను గుర్తించడం, వాళ్లను రిమాండ్‌కు పంపడంలో ప్రతిభ చూపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు లోకనాథరెడ్డి, విజయకృష్ణారెడ్డి, జిల్లా న్యాయ సలహాదారులు రామకృష్ణ తదితరులను ఎస్పీ సన్మానించి, అభినందించారు. జిల్లాలో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్లను అమలు చేస్తున్న పోలీసు అధికారులకు నగదు రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాబుప్రసాద్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గంగాధరనెల్లూరు: రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్–17 విభాగం బాలబాలికలకు హాకీ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయుడు సెల్వ పాండియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారుల్లో బాలికల జట్టుకు 18 మంది, బాలురు జట్టుకు 18 మందిని ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అండర్–17 విభాగం బాలికల జట్టుకు వంశికారెడ్డి, భవ్యలక్ష్మి, మల్లీశ్వరి, మీనాక్షి, తేజశ్విని, సింధు, భవ్య, లిజీ, ధరణి, ఉమామహేశ్వరి, మాహాలక్ష్మి, అమృత, అనుష్క, నందిని, యోగిత, లీలావతి, పల్లవి, లాసియా, సమ్రీన్, పర్ణికశ్రీ, చరణ్య ఎన్నికయ్యారన్నారు. బాలురు జట్టుకు భానుప్రకాష్, ధనుష్, శశికుమార్, శ్రీరామ్, యశ్వంత్, కృష్ణకుమార్, కిరణ్, వంశీ, సంతోష్, తోగయ్య, సుబ్రమణ్యం, కోమల్, హర్ష, ప్రకాష్, రోహిత్, భానుప్రసాద్, మునిసాయి, గణేష్, తాఫీల్ ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం, ఎంఈఓలే అంజనేయులు శెట్టి, గుణశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు దినకరన్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.